




# నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, సోమవారం 3 జూన్ 2024 | MEDAK







## అమరుల త్యాగం సదా స్మరణీయం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- మెదక్ కలెక్టరేట్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్
- తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మెదక్, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, అమరుల త్యాగాలు సదా స్మరణీయమని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మెదక్ కలెక్టరేట్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ మహేందర్, డీఎస్పీ డాక్టర్ రాజేశ్, డీఆర్వో పద్మశ్రీ, ఆర్డీవో రమాదేవి, వివిధ శాఖల అధికారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపానికి పూలమాలలు వేసి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థినులకు నోట్‌బుక్కులు, పెన్నులు అందజేశారు.



మెదక్ కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అమరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## అమరులకు నివాళులర్పించిన హరీశ్‌రావు

సిద్దిపేట, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి అమరులను స్మరించుకున్నారు.

## ప్రత్యేక రాష్ట్ర సాధనకే బీఆర్ఎస్ ఆవిర్భావం

### ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర సాధనకే ఆనాడు కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించారని, కేసీఆర్ పట్టుదలతో 14ఏండ్ల నిరంతర పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయజెండా ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో 1969 నుంచి అనేక మంది అమరులయ్యారని, అప్పటి కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు చీమకుట్టినట్లయినా అనిపించలేదన్నారు. కేసీఆర్ చేపట్టిన ఉద్యమ ఫలితంగానే రాష్ట్రాన్ని సాధించుకున్నట్లు తెలిపారు. మలిదశ ఉద్యమంలో అనేక పోరాటాలు చేయడంతోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటుకు ముందుకొచ్చి ప్రకటన చేసిందన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి ప్రతి కుటుంబానికి న్యాయం చేశారన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో సాగు నీరందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో వ్యతిరేకత మొదలైందని, ఆరు గ్యారెంటీలు, 420 హామీల ఊసేత్తడం లేదన్నారు. రైతులు విత్తనాల కోసం రోడ్లమీదికి వస్తున్నారని, ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జడ్పీటీసీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండావిష్కరణ చేస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

## హుస్నాబాద్‌లో దంచికొట్టిన వాన

- గంటన్నర పాటు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం
- చెరువును తలపించిన హుస్నాబాద్‌లోని మెయిన్ రోడ్డు, బస్టాండు ప్రాంతం
- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- చల్లబడిన వాతావరణం.. సేద తీరుతున్న జనం

హుస్నాబాద్, జూన్ 2: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలు, గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి వరకు కూడా కరెంటు రాలేదు. హుస్నాబాద్ పట్టణంలోని మెయిన్ రోడ్డు, బస్టాండ్ ప్రాంతం వరద నీటితో చిన్నపాటి చెరువును తలపించింది. మెయిన్ రోడ్డులో హైవే పనులు కొనసాగుతున్నందున రోడ్డుపైకి వర్షపు నీరు పెద్ద మొత్తంలో చేరడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇండ్లలోకి వరద చేరిం ది. చాలారోజుల తర్వాత భారీ వర్షం పడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సూర్యుడి ప్రతాపంతో భగభగ మండిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో జనం ఉపశమనం పొందా రు. రాత్రి వరకు కూడా ఉరుములు మెరుపులు కొనసాగాయి. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. భారీ వర్షంతో రైతుల్లో నూతనోత్సాహం వచ్చినట్లు అయింది. రేపటి నుంచి ఆరుతడి పంటల సాగు కు సన్నద్ధం కానున్నారు.



వర్షం నీటితో చెరువును తలపించిన హుస్నాబాద్ పట్టణంలోని మెయిన్ రోడ్డు

### పిడుగుపాటుతో పాడి గేదె మృతి



పిడుగుపాటుతో మృతిచెందిన పాడి గేదె

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 2 : సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్లలో ఆదివారం పిడుగు పాటుతో పాడిగేదె మృతిచెందింది. వల్లపట్లకు చెందిన నారదాసు రవి రోజు మాదిరి గానే తన పాడిగేదెను వ్యవసాయబావి వద్ద కట్టేశాడు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఉన్న పాడిగేదె పిడుగు పాటుకు గురై మృతి చెందింది. దీని విలువ రూ.90వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

### కోహెడలో వర్షం

కోహెడ, జూన్ 2: సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. సుమారు అరగంట సేపు కురిసిన వర్షానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వేసవి ఉక్కపోత, ఎండ వేడిమితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు కురిసిన వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. పట్టణంలో కోహెడ నుంచి కరీంనగర్ వెళ్లే దారిలో పిడుగుపడటంతో అదే ప్రాం తంలో ఉన్న పెంట్రోల్ పంప్‌లో సిస్టమ్స్ దెబ్బతిన్నాయి. ఆదివారం సంతకు వచ్చిన వ్యాపారులు, ప్రజలకు ఇబ్బంది కలిగింది.



గుమ్మడిదలలో దంచికొట్టిన వాన



హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న హైవే పనుల వల్ల దుకాణాల సముదాయం వద్ద నిలిచిన నీరు

### ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

సిద్దిపేట, జూన్ 2 : సిద్దిపేట పట్టణంతో పాటు ఆయా మండలాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రోజంతా ఎండగా ఉండి సాయంత్రం వాన పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సిద్దిపేటలో కురిసిన వర్షానికి రోడ్లపై వర్షం నీళ్లు పారాయి.



సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

### గుమ్మడిదలలో జోరు వాన

గుమ్మడిదల, జూన్ 2 : నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం మండల కేంద్రమైన గుమ్మడిదలతో పాటు పలు గ్రామాల్లో ఉరుములు,మెరుపులతో కూడిన వాన కురవడంతో వాతావరణం ఒక్కసారిగా మారింది. రైతులు వానకాలం పంటలకు సిద్ధపడుతున్నారు. యాసంగి సీజన్‌లో పండించిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## కేసీఆర్ పోరాటంతోనే సాకారం

- మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ వేడుకలు
- సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయజెండా ఆవిష్కరణ
- రంగధాంపల్లిలో అమరవీరుల స్తూపానికి నివాళులు



సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, జూన్ 2: కేసీఆర్ నాయకత్వంలో 14 ఏండ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రా న్ని సాధించుకున్నామని మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని రంగధాంపల్లి చౌరస్తాలో అమరవీరుల స్తూపానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జాతీయ జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పోరాటాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో నిస్వార్థంగా పోరాడి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చారని గుర్తుచేశారు.కులాలకు, మతాలకు అతీతంగా అందరూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. సబ్బం డ వర్గాలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని, అన్నిరంగాల్లో పురోగమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పాల సాయిరాం, గుండు భూపేశ్, వంగ నాగిరెడ్డి, ప్రభాకర్ వర్మ పాల్గొన్నారు.



రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

మెదక్, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : ఈనెల 4న జరిగే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు మెదక్ పార్లమెంట్ ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు. సాధారణ ఎన్నికల పరిశీలకుడు సమీర్ మాధవ్ కురుకోటి, మెదక్, నర్సాపూర్ కౌంటింగ్ అబ్జర్వర్ సమన్‌జిత్ సేన్ గుప్తా, పటాన్‌చెరు, సంగారెడ్డి కౌంటింగ్ అబ్జర్వర్ వీఎం ప్రజాపతి సమక్షంలో ఈ ప్రక్రియ పూర్తయినట్లు ఆయన తెలిపారు. ఆదివారం మెదక్ కలెక్టరేట్ ఛాంబర్‌లో 7 నియోజకవర్గాల కౌంటింగ్ సిబ్బంది, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి, కౌంటింగ్ సూపర్‌వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్స్‌ని కేటాయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీవో రమాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.